క్లుప్తంగా

2న ఆదివాసీ సంఘాలతో సమావేశం

ఇంద్రవెల్లి: ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి అమర వీరుల స్తూపం వద్ద నిర్వహించే అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణపై ఆదివాసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జుగ్నాక్ భారత్ శుక్రవారం తెలిపారు. న్యాయమైన హక్కుల కోసం పోరాడి అమరులైన ఆదివాసీ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించేందుకు ఏప్రిల్ 2న ఆదివాసీ సంఘాలు, పెద్దలతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలు హాజరు కావాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ స్టూడెంట్ ఫోరమ్ సొసైటీ అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓసియస్ కంప్యూటర్ కేంద్రంలో విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓసియస్ కేంద్రం సిబ్బంది మహేశ్‌సింగ్, సాయికుమార్, వేణు, అంకిత, సత్యనారాయణ, టీఎస్ఎఫ్ నాయకులు ఇఫ్తీకార్, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ: బోథ్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. బోథ్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలతో పాటుగా, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి విన్నవించినా.. పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో బోథ్‌కు వచ్చిన సందర్భంగా పీసీసీ హోదాలో ఇచ్చిన మాట నెరవేర్చాలన్నారు. ఇందులో ఎంపీటీసీ మహేందర్, బోథ్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, బీసీ సెల్ కార్యదర్శి బారే నాగేందర్, అడేపు కిరణ్‌కుమార్, నిగిని ఉప సర్పంచ్ సాయన్న, తదితరులు ఉన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 31న ఇచ్చోడ మండల కేంద్రంలో రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



గాలికుంటు టీకా వేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని జల్దా గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సిబ్బంది దేవ్‌రావు, శేఖర్‌లు కోరారు.

'కార్యకర్తలను గెలిపించుకుంటాం'

నేరడిగొండ: రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను గెలిపించుకుంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు తమను గెలిపించారని, ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దన్నారు. తనకున్న వ్యవసాయ పొలాన్ని అమ్మి కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.

వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందజేస్తున్న సభ్యులు

ఇచ్చోడ: బోథ్ మండలంలోని గుర్రలతండాలో శుక్రవారం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రఘువీర్ అనే దివ్యంగా యువకుడికి వీల్‌చైర్ అందచేశారు. గత కొన్ని రోజుల నుంచి అంగవైకల్యంతో బాధపడుతూ.. నడవలేని స్థితిలో ఉన్నాడు. ఇచ్చిన మాట ప్రకారం వీల్ చైర్‌ను సభ్యులు అందచేశారు.

అడవి బిడ్డలకు అందని విద్య

- పలు గ్రామాల్లో పాఠశాలలు కరువు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న చిన్నారులు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అసోదా గ్రామ పంచాయతీ పరిధిలోని పూనగూడ గ్రామానికి చెందిన వారు. ఇక్కడ ప్రాథమిక విద్య చదువుకునే సుమారు 20 మంది విద్యార్థులున్నారు. కానీ గ్రామానికి సమీపంలో పాఠశాల లేదు. కనీసం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం కూడా లేని దుస్థితి.



పూనగూడ గ్రామం

ఆదిలాబాద్‌రూరల్: అడవిని నమ్ముకొని జీవనం కొనసాగించే గిరిజనులు సర్వసాధారణంగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటారు. అలాంటి వారి పిల్లలకు కనీసం విద్య అందడం లేదు. ఎన్నికల సమయంలో, ఇతర సందర్భాల్లో గ్రామాలకు వెళ్లినా.. ప్రజాప్రనిధులు, అధికారులు గిరి విద్యార్థులు ప్రతిఒక్కరూ చదువుకోవాలని, చదువుతోనే సమాజంలో గుర్తింపు లభించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వసతులు కల్పించడం లేదు. గ్రామాల్లో మాత్రం పాఠశాలలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో గిరి చిన్నారులకు విద్య అందని ద్రాక్షగా మారుతుంది. కనీసం తమ గ్రామాల్లో పాఠశాలలు లేకపోవడంతో తమ పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని గిరిజనులు వాపోతున్నారు.

గ్రామంలో పాఠశాల లేదు

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. గిరిజన ప్రాథమిక పాఠశాలలు అంటే ఒకటో, రెండో తరగతి 47 పాఠశాలలు ఉన్నాయి. ఉదాహరణకు మండలంలోని అసోదా గ్రామ పంచాయతీ పరిధిలోని పూనగూడ గ్రామంలో సుమారు 20 వరకు చిన్నారులు ప్రాథమిక స్థాయి విద్యను అభ్యసించే వారు ఉన్నారు. కానీ ఇక్కడ, గ్రామానికి సమీపంలో పాఠశాల లేదు. కొన్ని గ్రామాల్లో టీడబ్ల్యూపీఎస్ పాఠశాల ఉన్నప్పటికీ అక్కడ సరిపడేంత విద్యార్థులు లేకపోవడంతో వారిని సమీపంలోని పాఠశాలలకు పంపుతున్నారు.

కూలీలుగా మారే ప్రమాదం

చిన్న వయస్సులో పాఠశాలకు వెళ్లి అక్షరాలు నేర్చుకోవాల్సిన విద్యార్థులు వారికి పాఠశాల అందుబాటులో లేకపోవడంతో కూలీలుగా మారే ప్రమాదం ఉంది. వారి పిల్లలను చదివించాలని ఆసక్తి ఉన్న కొంత మంది తల్లిదండ్రులు ప్రాథమిక స్థాయి వరకు విద్యను నేర్పించేందుకు పాఠశాలలు ఉన్న వారి బంధువుల ఇంటికి పంపుతున్నారు. అనంతరం మూడో తరగతి నుంచి వసతి గృహాల్లో చేర్పిస్తున్నారు. పిల్లలు అధికంగా ఉన్న చోట పాఠశాల ఏర్పాటు చేయవాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని యువకులు పేర్కొంటున్నారు.

'అంగన్‌వాడీ' కూడా లేదు



నేను ఇదే గ్రామంలో జన్మించా. ఏళ్లు గడుస్తున్న పాఠశాల లేదు. కనీసం అంగన్‌వాడీ కేంద్రం కూడా లేదు. మా తండ్రి మా బంధువుల ఇంటి వద్ద ఉంచి నన్ను ప్రాథమిక విద్యను చదివించాడు. అనంతరం హాస్టల్‌కు వెళ్లి డిగ్రీ చదువుతున్నా. – జుగదీరావ్, యువకుడు, పూనగూడ

బడి నిర్మించాలి



చదువుతోనే మనిషికి గుర్తింపు ఉంటుంది. ప్రస్తుతం మా ఊరిలో ప్రాథమిక పాఠశాల చదివే 20 మంది వరకు పిల్లలు ఉన్నారు. కానీ పాఠశాల లేదు. చదువాలనే ఆసక్తి ఉన్న పాఠశాల లేకపోవడంతో ప్రయోజనం లేదు. – పరమేష్, యువకుడు, పూనగూడ

పాఠశాల ఏర్పాటుకు కృషి

ఆదిలాబాద్ రూరల్ మండలంలో టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు లేని గ్రామాలు తన దృష్టికి రాలేదు. ప్రాథమిక స్థాయి విద్య నేర్చుకునేంత విద్యార్థుల సంఖ్య ఉంటే ఐటీడీఏ పీవోకు గ్రామస్తులు వినతిపత్రం అందజేస్తే ఏర్పాటుకు కృషి చేస్తారు. – నిహారిక, ఏటీడీవో, ఆదిలాబాద్

ఘనంగా గుడ్ ఫ్రై డే



తాంసి చర్చిలో..

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రంతో పాటు బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శ్యాంపూర్ గ్రామాల్లో గుడ్ ఫ్రై డే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణ కేంద్రంలోని మోరియా, సీఎస్ఐ, సేయింట్‌పాల్, బెతెస్థ చర్చిలో ప్రార్థనలు చేశారు. శాంతియుత సమాజం కోసం తన రక్తాన్ని చింధించిన యేసు జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని పాస్టర్లు సూచించారు.



ఉట్నూర్‌రూరల్: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాంసి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ చర్చిలో గుడ్ ఫ్రై డే వేడుకలు జరుపుకున్నారు. యేసుక్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలువ మార్గను మోస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చర్చి పాదర్ జోమున్ జార్జ్, సిస్టర్స్ సామీప్య, అమాలియ, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని హోలీ ట్రీనటి చర్చిలో క్రైస్తవులు గుడ్ ఫ్రై డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలతో పరిశుద్ధ విలువ మార్గం చేస్తూ యేసు మరణాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాదర్ జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

వరద కోత.. గిరిజనులకు ప్రయాణ గోస



ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామం నుంచి చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని వంతెన వద్ద గత ఏడాది భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రజలు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్, ఆటో వెళ్లాలేని పరిస్థితి. ఏడాది గడిచినా.. అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో ఆదివాసీలకు ప్రయాణ గోస తప్పడం లేదు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన నిమ్మల రాజితను రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

మల్లన్న దేవుని ఉత్సవాలు



జోగు కార్యక్రమంలో భక్తులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో అగ్గిమల్లన్న దేవుని ఆలయ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మల్లన్న దేవుడి పట్నాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కుర్మ సంఘం తోపాటు గ్రామస్తులు ఇంటింటా జోగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామికి ధాన్యం, బియ్యం, పలు రకాల పప్పు దినుసులను మల్లన్నస్వామికి సమర్పించారు. ఈనెల 30న రాత్రి ఒగ్గు కథ, 31న గంగాస్నానం, పుట్ట బంగారం, ఏప్రిల్ 1న బోనాలు, లగ్నం, నాగవెల్లి పట్నాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సురేశ్

ఖానాపూర్: ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో పీఆర్‌టీయూ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆశవర్కర్లకు నెలసరి పారితోషికంతోపాటు లెప్రసీ సర్వే, ఎన్నికల డ్యూటీల పెండింగ్ డబ్బులను చెల్లించాలని కోరారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గంగామణి, సుజాత, స్వాతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రం భవనం



బేలలోని ఆరోగ్య ఉపకేంద్రం భవనం

బేల: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం అసంపూర్తిగా మారింది. గత రెండు నెలల నుంచి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు అంటున్నారు. గోడలకు ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, కలర్, విద్యుదీకరణ పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఖానాపూర్‌లో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఆదిలాబాద్‌రూరల్: పల్లె దవాఖానాల ద్వారా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు 'అందని వైద్యం' శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సర్ఫారాజ్ స్పందించి పల్లె దవాఖానను తెరిపించారు. ఖానాపూర్ గ్రామంతో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే వైద్యుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలన్నారు.

'అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు'



మాట్లాడుతున్న సీఐ విజేందర్

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అక్రమంగా మద్యం విక్రయించిన, దేశీదారును మహారాష్ట నుంచి తీసుకువచ్చిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 32 కేసులు నమోదు చేసి, 22 మందిని ఆరెస్ట్ చేసినట్లు తెలిపారు. 66 లీటర్ల మద్యం, 8 లీటర్ల బీర్లు, 79 లీటర్ల దేశీదారు, ఏడు లీటర్ల ఐడీ లిక్కర్ సీజ్ చేసినట్లుగా పేర్కొన్నారు. అలాగే నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు 8మందిని బైండోవర్ చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించేవారిపై అవసరమైతే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాలి



రోడ్డు కొలతలు తీసుకుంటున్న అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు నిర్మించనున్న రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ చౌహాన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ నర్సయ్య మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ డీఈ హరికృష్ణ, ఏఈ రాజు, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విందుకు ముస్లిం మతపెద్దలు, వివిధ పార్టీల మైనార్టీ నాయకులు హాజరయ్యారు. తొలుత ప్రత్యేక పార్థనలు నిర్వహించి ఖర్జూరాలతో ఉపవాస దీక్షలను విరమించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ సీఎంగా పనిచేసిన పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మైనార్టీ నాయకులు యూనీస్ అక్బానీ, సాజిదోద్దీన్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జామా మసిద్‌లో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా బోథ్ నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర దీక్షలు చేపట్టి భక్తి మార్గంలో నడవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జహీర్, అంబేకర్ పండరి, రాథోడ్ సురేందర్, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో పది రోజులుగా స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీలో బోథ్ పట్టణ 11 స్టార్ జట్టు విజేతగా నిలువగా, రన్నరఫ్‌గా స్వామి వివేకానంద యూత్ కనుగుట్ట జట్టు నిలిచింది. దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవి, రమణ, తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇదవు పోశెట్టి, ఆకుల రాజేందర్, అశోక్, తుకారాం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బావాపూర్(ఆర్)లో ఇస్తున్న కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ బ్లాక్ మేనేజర్ మాలావత్ గణేశ్ అన్నారు. శుక్రవారం పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించారు. కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం స్వావలంబన సాధించాలని కోరారు.